పాపభయంబు పోయె పరిపాటయి పోయెను దుష్టఫలంబులన్
శ్రీపతి భక్తి పొందె వివరింపగలేని దురంతకృత్యముల్
దాపురమయ్యె లోకమున తాపస లోకశరణ్యుడైన ఆ
శ్రీపతి నామ చింతనయె చేకురచేయు సుఖంబు మానవా!

పుస్తకముల్ పఠించితిని పూర్తిగ జూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలను నేర్చితినంచు నిగర్వమేల? నే
వ్యస్త యుగంబు మోక్షి పరమాత్మను భక్తితో కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియును ధాత్రి నిరర్థకము కద మానవా!

జానెడు పొట్ట నింపుకొన చిక్కులనొందుచు కోటి విద్యలన్
పూనిక మీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ
మానవ జాతి దుఃఖముల గ్రుంగక నేటికి శ్రీపరాత్పరున్
ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!

విద్యార్థులారా.

దివ్యత్వమును పొందే నిమిత్తమై మానవుడు అనేక విధములైన సాధనలు
లాచరిస్తూ కాలమును, కాయమును, కర్మమును కూడను సార్థకము గావించుకొనే నిమిత్త
మై పలుపలు విధముల ప్రయత్నము సలుపుచున్నాడు. కాని యీ సాధనల యొక్క పరి
ణామమును, యీ సాధనల యొక్క గమ్యము ఏమిటి? సాధనలనగా ఏమిటి? వాటి అర్థము
ను గుర్తించుకొలేక పోవటంచేతనే మానవుడు ఎన్నివిధములైన సాధనలు సల్పినప్ప
టికిని తను ఆశించిన పవిత్రతను పొందలేక పోతున్నాడు. సాధన అనగా ఏమిటో
మొట్టమొదట గుర్తించుకున్నప్పుడే యీ సాఫల్యము అనే దానిని కొంతవరకు పొంద
టానికి వీలవుతుంది. కాని లోకములో నవవిధ మార్గములందు యీ సాధనలు సల్పు
చూ కేవలము దాని యొక్క అంతరార్థమును గుర్తించుకొనలేక కాలమును, కాయము
ను, కర్తవ్యమును కూడను వ్యర్థము గావించుచున్నారు. సాధన అనగా ఏమిటి? జప
ము, ధ్యానము, భజన, యోగము యిత్యాది సత్కర్మలు సాధన అనిపించుకుంటుం
దా? కాదు. కాదు. చెడును మంచిగా మార్చుకొనుటయే నిజమైన సాధన. దుఃఖము

ను సుఖముగా మార్చుకోటమే నిజమైన సాధన. దుఃఖము లేక సుఖము లేదు. చెడు లేక మంచి రాదు. చెడు మంచి, సుఖము, దుఃఖము నిరంతరము రెండింటికి సంగ్రామము జరుగుతూనే వుంటున్నది. కనుక ఈ రెండింటిని వేరు చేయుటము ఎవరి తరము కాదు.

కష్టసుఖములు రెండును గలిసియుండు
దాని విడదీయు టెవ్వరి వశము కాదు
సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము
కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు

కష్టసుఖములు రెండు అవినాభావ సంబంధములై అన్యోన్య ఆశ్రయములై జీవిస్తూ వుంటాయి. ఒకటి ఆది. రెండవది అంత్యము. ఒకటి ప్రారంభము. రెండవది అంత్యము. ఆదికి అంత్యము, అంత్యమునకు ఆది లేకుండా వుండటానికి వీలు కాదు. కేవలము ఆద్యంతరహితుడు దైవత్వము తప్ప లోక సంబంధమైన ప్రాకృతమైన వస్తువులకు గాని, విషయములకు గాని, వ్యక్తులకు గాని, ఆనందమునకు గాని అంత్యము వుంటున్నది. దుఃఖమనేది ఎవరో తెచ్చి మన నెత్తి పైన వేయటం లేదు. లేక బాధలు చెడ్డ అనేది ఎక్కడ నుంచో వచ్చి మన తలలో చేరటం లేదు. చెడ్డ దుఃఖము ఈ రెండు సహజంగానే ఆవిర్భవిస్తున్నాయి. ఎంతటి పవిత్రమైనది అయినప్పటికిని సాధన చేయకున్న యిది ఒక విధమైన నీచస్థితికి దిగజారిపోతుంది. ఎంత విలువైనదైనప్పటికి దాని యొక్క విలువ క్రమక్రమేణా క్షీణించిపోతుంది. సాధనల చేతనే దాని విలువ అభివృద్ధిగాంచుతుంది. ఒక చిన్న డైమండ్. ఇదిమనకు చిక్కినదనుకోండి. కాని దాని విలువ చాలా తక్కువగా వుంటుంది. దాన్ని అనేక విధములైన సంస్కారములు సలిపినప్పుడే దాన్ని cuttings చేసినప్పుడే దాని విలువ పెరిగిపోతుంది. బంగారమైనప్పటికి మొట్టమొదట మట్టిలో రాతిలో కూడి వుంటుంది. దాన్ని సంస్కారమనే సాధన సల్పినప్పుడు స్వచ్ఛమైన అపరంజిగా మారి దానికి సరియైన విలువ లభిస్తుంది. కనుక సాధన చేత అల్పత్వమైనది అధికత్వమును పొందుతుంది. అధోగతిలో వున్నా ఉన్నత స్థాయికి చేరుతుంది. పుట్టిన తక్షణమే ఏ వ్యక్తి విద్యావంతుడు గాని, పండితుడు గాని లేక గుణవంతుడు గాని కాడు. క్రమక్రమేణా తాను కొన్ని విధములైన సాధనలు సల్పటం చేతనే తాను గుణవంతుడుగను విద్యావంతుడుగాను రూపొందగలుగుతున్నాడు.

జగత్తునందు సహజసృష్టి కేవలము చెడ్డలోనే సృష్టించబడుతున్నది. ఈ చెడ్డ నుంచియే మంచి ఆవిర్భవిస్తుంది. చెడ్డ లేక మంచి ఆవిర్భవిం

చటానికి అవకాశము లేదు. ఒకదానిని మనము ఆశిస్తున్నామంటే ఆ ఆశకు నిరాశ సంబంధమైనది ఒక కారణంగా వుంటున్నది. ఆశ నిరాశలతో కూడినదే మానవ జీవితము. లేక సంకల్పవికల్పములతో కూడినదే మానవ జీవితము. సంయోగ వియోగములతో కూడినదే మానవ జీవితము. కనుక సంసారమనేది ఏమంటే సంయోగ వియోగ సంఘర్షణాత్మక మహోత్తుంగ తరంగ సాగరము అన్నారు. ఇలాంటి సాగరమునందే విలువైన రత్నము ముత్యములు మనకు లభ్యమవుతాయి. దీనిని మనము తట్టుకొని, నిట్టుకొని ముందుకు సాగినప్పుడే ఉద్దిష్టమైన స్థితిని మనము పొందగలుగుతాము. అట్లుకాక అన్నింటికి ఎదురుతూ బెదురుతూ మనము దీనిని యే విధమైన సాధనల ద్వారా సరైన మార్గమున మనము తెప్పించుకొనలేకపోయిన మన జీవితమే వ్యర్థమవుతుంది. అనేక అడ్డు తగులుతూ వుంటాయి మన జీవితమునకు. ఏ విధమైన అడ్డు లేకుండిన మానవత్వమునకే విలువ లేదు. కనుక మానవత్వమునకు విలువనందించేవి దుఃఖము, అశాంతి, చెడు. కష్టే ఫలే అన్నారు. కష్టము లేక యే విధమైన ఫలితము మనము పొందలేము. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని చిన్న వాక్యంగా చెప్పారు. సాధన అనగా ఇదియే మనము చేసుకోవలసినది. చెడును మంచిగా మార్చుకోటము. దుఃఖమును ఆనందముగా మార్చుకోటము. చెడ్డను మంచిగా రూపొందింప చేసుకోటం. దీనికి మనస్సు అత్యవసరము.

మనస్సు యొక్క మహత్తరమైన శక్తిసామర్థ్యములు మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు. సమస్త సుఖదుఃఖములకు మనస్సే మూలకారణం. మనస్సునందున్న దివ్యమైన శక్తి ఇట్టిది అట్టిది అని ఎవ్వరూ కూడ వివరించలేరు. వర్ణనాతీతమైనది మనస్సు యొక్క స్వభావము. క్షణములో ఏర్పడి వ్యాపించి పోతుంది. క్షణములో స్తంభించి పోతుంది. క్షణములో వికసిస్తుంది. క్షణములో ముకుళిస్తుంది. కనుకనే కర్మను బంధించి మనస్సులోకి మానవత్వముతో మనస్సు బంధింపబడుతూ వుంటున్నది. మనస్సు చేతనే జగత్తు బంధింపబడుతున్నది. 'మనో మూలమిదం జగత్' మంచి చెడ్డలకు మనసే మూలకారణము. మనము ఆహారము తీసుకుంటున్నామనుకోండి. ఈ ఆహారము జీర్ణించబడి దేహానికి పుష్టిని సంతుష్టిని అందిస్తున్నది అని మనము భావిస్తున్నాము. కాదు ఆహారము కాదు మనకు పుష్టిని సంతుష్టిని అందించునది. మనస్సే. ఈ ఆహారము తీసుకొను సమయములో పల మనస్సు వుల్లాసంగా, ఆహ్లాదంగా, ఆనందంగా లేకపోయినప్పుడు ఆ ఆహారమంతా విషంగా మారిపోతుంది. కనుక మానవత్వానికి పవిత్రమైన దివ్యత్వమును చేకూర్చేది

మనస్సు. ఏది చేసినా, ఏది చూచినా, ఏది చెప్పినా, ఏది తలచినా పవిత్రమైన రీతిగా చింతించుటానికి ప్రయత్నించాలి. కనుక మానవత్వము లో మలిన సంకల్పము లేకయే కార్యమునకు మనము ముందడుగు వేయలేము. ఈ మనో సంకల్పముల ప్రభావమే మానవజాతి సుఖసంతోషములకు మూలకారణము.

మానవుడు భుజబలమును, బుద్ధిబలమును, మనోబలమును ధనబలమును, అధికారబలమును గుర్తించి తనకు కేవలం మూర్ఖంగా మురిసిపోతున్నాడు. కానీ యీ అన్నింటికిని సుప్తముగా వుండిన అహంకారమనే పెను భూతము యే విధమైన మార్గమునందు పడద్రోయునో అనే విషయమును మనం గుర్తించుటానికి ప్రయత్నించుట లేదు. 'శతమానం భవతి శతాయుష్మాన్...' అని నూరు సంవత్సరములు మానవునకు జీవితమని ఆశీర్వాదము పొందుతుంటారు. కానీ నిత్యజీవితము లో మనకు ప్రత్యక్షంగా గోచరించేది మధ్యకాలములోనే మరణించే జీవులు ఎన్నో వుంటున్నాయి. దానికి సత్యము యిది అని ఎవ్వరూ నిర్ణయించలేరు.

శతవర్షముల దాక మితము చెప్పిరి గాని
నమ్మరాదా మాట నెమ్మనమున
బాల్యమందో లేక ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎప్పుడో విడిచెడి ఎరుక లేదు

కనుక దీనిని ఎవరూ నిర్ణయించే అధికారము లేదు. కానీ నూరు సంవత్సరములని చెప్పుటలో వుండిన అంతరార్థము ఏమిటి? సర్వశాస్త్రములు మానవునకు నూరు సంవత్సరములని చెప్పాయి. ఇవి కేవలము శాస్త్రీయులు వర్ణించిన వర్ణనలు కావు. ఇది పరమ సత్యము. ప్రతి మానవుడు నూరు సంవత్సరములు వుండవలసినదే. అప్పుడు కొన్ని మధ్యలో పోవటానికి కారణాలు ఏమిటి? మానవుని యందు ఆవిర్భవించే అహంకారము, అసూయ, దుర్భావములు, దుర్గుణములు, దురహంకారము యిలాంటి శక్తులనేవి మానవుని ఆయుష్షును ముక్కలు ముక్కలు చేస్తున్నాయి. ఈ దుర్గుణములే మానవుని ఆయువును అంతము గావిస్తూ వుంటున్నాయి. ఆయువు నూరు వర్షములే. మధ్యలో యీ విధమైన దుష్టశక్తులు ప్రవేశించి యీ ఆయువును అంతము చేస్తున్నాయి కనుకనే మానవుడు సద్గుణములు సదాచారములు సచ్చింతనలు యిలాంటి సద్గుణములు కల్గినప్పుడే మానవుని ఆయుష్షు నూరు సంవత్సరములు నిండిపోతుంది. పూర్వము మహరులందరు కూడను నూరు సంవత్సరములు జీవించటా

701069105

నికి వున్న అంతరార్థమిదియే. ఈనాటి మానవుడు నిరంతరము దుశ్చింతల లోనే కాలము గడుపుతున్నాడు. దురభ్యాసముల లోనే కాలము గడుపుతున్నాడు. దుశ్చర్యల లోనే కాలము గడుపుచున్నాడు. దుర్గుణముల లోనే జీవితమును అంకితముగా వించుకుంటున్నాడు.

విద్యార్థులారా! సచ్చింతలను, సదాచారములను, సత్ప్రవర్తనలను అత్యధికంగా మీరు పోషించుకోవాలి. భగవంతుని యందు భక్తిప్రపత్తులు అభివృద్ధి గావించుకోవాలి.

ఆస్తిక బుద్ధి పోయి మర్యాదల ధర్మము రూపుమాసె బళీ
నాస్తిక బుద్ధి హెచ్చె గురువన్నను శ్రద్ధయు పోయె భక్తికిన్
స్వస్తి.....

ఇలాంటి భావములలో మూడిన మానవత్వము ఏవిధంగా 'శత మానం భవతి...' అనే దానికి అర్హత అవుతుంది. మనము ఆత్మవిశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. ఈ ఆత్మవిశ్వాసము క్షీణించిపోతుండరాదు. తనను తాను నమ్మలేని మానవుడు ఎవరిని నమ్మగలడు. తానే దైవము. గుడ్డివాడు రవిని చూడలేడు. అహంకార పురుషుడు ఆత్మను గానలేడు. కనుక అహంకారమనేది మానవుని దృష్టిని కంటికి పొరవలె కప్పి దృష్టిని మందము గావించుచున్నది. కాన ఈ అహంకారమునకు మనము ఎట్టి అవకాశము అందించరాదు. మన పదవులుగాని, మన విద్యలుగాని, మన సిరిసంపదలుగాని ఇవన్నీ కదలిపోయె మేఘములు. ఈనాటి మానవుడు తన జీవితములో అర్థభాగమును ధనసంపాదన నిమిత్తమై వినియోగము చేస్తున్నాడు కాని ఆ కాలమందు కించిత్ భాగమైనా కూడను ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశపెడుతున్నాడా? లేక పరోపకార సంబంధమైన పవిత్ర కార్యములలో ప్రవేశపెడుతున్నాడా? 'పరోపకారార్థమిదం శరీరమ్' శరీరము వచ్చినది పరోపకార నిమిత్తముకదా! ఇలాంటి సత్యాన్ని మానవుడు ఎందుకు గుర్తించటంలేదు? నిరంతరము స్వార్థము స్వప్రయోజనమునందే మానవుడు జీవితమును అంకితముగావించుకుంటున్నాడు. ఈనాటి మానవుడు జీవితమంతా స్వార్థము చేతిలో కీలుబొమ్మ వలె వున్నాడు. ఏ పదార్థమును ప్రేమించినా ఆ పదార్థము నిమిత్తమై మానవుడు పదార్థమును ప్రేమించటంలేదు తన నిమిత్తమై పదార్థమును ప్రేమిస్తున్నాడు. ఏ వ్యక్తిని ప్రేమించినప్పటికిని వ్యక్తి నిమిత్తమై వ్యక్తిని ప్రేమించటం లేదు. మనస్వార్థ నిమిత్తమై వ్యక్తిని ప్రేమిస్తున్నాము. ఈ విధముగా ప్రతి చిన్న విషయమునందు మానవుడు లోతుగా దిగి సూక్ష్మముగా విచారణ సల్పినప్పుడు అంతా స్వార్థమే స్వార్థము. ఈ అర్థము లేని

స్వార్థమును ఆధారము చేసుకొని అనంతమైన ఆత్మ తత్త్వమును విస్మరిస్తున్నాడు. కాను కమానవుడు మొట్టమొదట తన స్వార్థాన్ని దూరము చేసుకున్నప్పుడే యీ దుష్ప్రవృత్తులు లోపల యేమాత్రము ప్రవేశించటానికి అవకాశము వుండదు.

మానవునికి ఏమిటి ప్రధానము? పాప భీతి, దైవప్రీతి, సంఘనీతి యీ మూడూ ముమ్మూర్తులుగా మనం విశ్వసించాలి. పాప భీతి లేనప్పుడు ఎలాంటి దైనను మానవుడు ఆచరించటానికి వడుము కట్టుకుంటాడు.

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వ మడగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు.

ఈ విశ్వశాంతికి విఘ్నము యిదియే. పాప భీతి లేకపోవటము, దైవప్రీతి లేకపోవటము యీ రెండింటి కారణము చేతనే యీ దేశము విప్లవానికి గురైపోయింది. విద్యార్థులారా! భావి భారతోద్ధారకులు, భవిష్యత్ జీవితమునకు మీరే దీనికి ఆధారము. కనుక పరిశుద్ధమైన చిత్తము కలిగి పవిత్రమైన భావముల చేత దేశోపకార నిమిత్తమై యీ దేహము ఆవిర్భవించినదనే సత్యాన్ని గుర్తించి తోటి మానవులకు సరియైన చేదోడు వాదోడుగా వుండి లోకాస్సమస్తా సుఖినో భవంతు అనే విశాల భావాన్ని పెంచుకోవాలని నేను ఆశిస్తున్నాను. వ్యాస మహర్షి అష్టాదశ పురాణములను రచించాడు. కాని ఏమిటి వాటి యొక్క అంతరార్థము.

అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచన ద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.

Help ever hurt never. ఈ రెండింటిని మీరు చిత్తమునందు భద్రము చేసుకోండి. ఎలాంటి పరిస్థితులయందైనా కూడను ఎవరిని బాధించకుండా చూచుకోండి. సాధ్యమైనంత వరకు నీవు కూడా బాధపడకుండా చూచుకోవాలి. Self లో భద్రము వుంటే కదా help లో పవిత్రమైనది ఆచరించవచ్చు. కనుక Self-help స్వార్థము, పరార్థము రెండింటి యొక్క యదార్థమును గుర్తించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! ఈనాటి మానవ జీవితము అనేక సమస్యలతో కట్టుబడి వుంటున్నది. కేవలము సమస్యల తోరణముగానే తయారౌతున్నది. దేనిని నమ్మాలి. దేనిని నమ్మరాదు. దేనిని చెయ్యాలి దేనిని చెయ్యరాదు అనే యీ నిత్యానిత్య విషయ పరిశీలన చేసే శక్తి సామర్థ్యములు యీనాడు మానవుడు

కోల్పోయాడు. నమ్మరాని వాటిని నమ్ముతున్నాడు. నమ్మదగిన వానిని నమ్మటం లేదు దీనికి కారణం ఏమిటి? దీనికి కూడను స్వార్థమే. మనస్సు యొక్క తత్వమును మనం చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. మానవుడే జగత్తును సృష్టిస్తున్నాడు మనిషంటే ఎవరు? మనిషంటే మనసే. మనసంటే ఏమిటి? సంకల్పముల యొక్క చేరికే. సంకల్పములంటే ఏమిటి? నిత్యజీవితములో మనము ఆచరించుటానికి ప్రవేశపెట్టే చర్యలే. కనుక ఏనాడు చర్యలు బాగా వుండినప్పుడే జగత్తు బాగా వుంటుంది. చర్యలు చెడిపోయినప్పుడు ఈ జగత్తు చెడిపోతుంది. కాబట్టి జగత్తు మంచి చెడ్డలు వ్యక్తి చర్యలపైన ఆధారపడి వుంటున్నది. జగత్తు ఏనాటికీ చెడ్డది కాదు. జగత్తులో ఏనాడూ చెడు లేదు. జగత్తులో ఏనాడూ దుఃఖము లేదు ఈ దుఃఖములను చెడులను మనకు మనమే సృష్టించుకుంటున్నాం. నీ దుర్భావాల చేత దుఃఖానికి గురౌతున్నావు. మనస్సు నిరంతరము పవిత్రంగా పెట్టుకోండి దానిలో ఏ చెడు భావము ప్రవేశించకుండా చూచుకోండి. చెడు యేదైనా ఇందులో ప్రవేశించినప్పుడు తక్షణమే భగవచ్చింతన చేసి ఆ చెడ్డను దూరం గావించుకోండి. అంతేగాని ముండ్ల చెట్లు పెరగాలని దానికి పాదు కట్టి, ఎరువువేసి దాన్ని పెంచుకోటానికి ప్రయత్నం చేయకూడదు. ముండ్ల చెట్లూ, పండ్ల చెట్లూ రెండూ వుంటున్నాయి. కాని పండ్ల చెట్లను ఎక్కడ పోషించాలి, ముండ్ల చెట్లను ఎక్కడ పోషించాలి అనే విభాగాన్ని గుర్తించాలి. పండ్ల చెట్లను మధ్యలో పెట్టుకొని ముండ్ల చెట్లను కంచెగా కట్టుకున్నప్పుడు పండ్లు కూడను అభివృద్ధి అవుతాయి. ముండ్ల చెట్లు కూడను మనకు వుపకారమే చేస్తాయి. కనుక రెండింటిని సరియైన రీతిలో వుపయోగపెట్టినప్పుడు రెండూ మనకు వుపకారమే.

మానవునకు సుఖదుఃఖములు వుండినట్లే ఈ జగత్తు లోపల ఉష్ణ శీతలాలు వుంటున్నాయి. ఈ శీతోష్ణములను పురస్కరించుకొని మనము ఏవిధముగా నడచుకుంటున్నామో సుఖదుఃఖములను పురస్కరించుకొని మనము అదే విధముగానే నడచటానికి పూనుకోవాలి. ఇప్పుడు ఎండల లోపల చాలా వేడిగా వుంటున్నది. వేడిగా వుండటం వలన ఎలాంటి దుస్తులు మనం ధరిస్తున్నాము. వేడికి అవసరమైన దుస్తులు చాలా Thin గా వుండే దుస్తులు వేస్తున్నాము. ఇంక Hill Station కి పోయినప్పుడు చలి అధికంగా వుంటుంది. ఈ చలిని మనము దూరము చేయటానికి వీలుకాదు. కాని ఆ చలికి తగిన దుస్తులు మనము ధరించుకొని చలినుండి మనము రక్షించుకోవాలి. ఈ వేడికి తగిన దుస్తులు ధరించి వేడినుండి మనము దూరముకావాలి. ఈవిధంగా శీతోష్ణములను adjust

చేసుకొని అనుసరించటం వలన మనము తగిన సుఖాన్ని పొందుతున్నామో అదే విధముగా దుఃఖమును, విచారమును సమర్థించుకొని దీని నుంచి దూరము కావటానికి తగిన కృషి చెయ్యాలి. దుఃఖము మననుండి ఆవిర్భవించినప్పుడు సుఖాన్ని చింతించాలి. మనకు కష్టములు ప్రాప్తించినప్పుడు ఆనందమును చింతించాలి. ఈ విధమైన నిత్యానిత్య విషయ పరిశీలన చేసే సామర్థ్యమును అభివృద్ధి గావించుకోవాలి. అంతేగాని దుఃఖమే లేకుండా చేసుకోవాలంటే యిది ఎవరి తరము కాదు. దేహబాధ లేకుండా వుండాలంటే వీలు కాదు. చెడ్డ లేకుండా జగత్తులో జీవించటము అసాధ్యము. చెడ్డ వుంటున్నది మంచి వుంటున్నది. మంచి చెడ్డల లోపల వున్న తారతమ్యమును గుర్తించి సమయస్ఫూర్తిగా మనము ప్రవర్తించాలి. ఈ విధమైన adjustments, understanding విద్యార్థులలో అత్యవసరము. మొట్టమొదట understand చేసుకో. adjustment easy అవుతుంది. కనుక మానవుని యందున్న ఏకత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఒక భిక్షగాని దగ్గరకు వెళ్ళి అతనిని నీవెవరు అంటే అతను తాను పరిచయం చేసుకునే సమయంలో నేను ఫలాని వాళ్ళ స్వామి అంటాడు. నీవు gentleman దగ్గరకు పోయి నీవెవరు అని అడుగు అతను కూడా నేను ఫలానా అని తాను పరిచయం చేసుకుంటాడు. స్త్రీల దగ్గరకు పోయి ప్రశ్నించారు వారు కూడను తమకు తాము పరిచయం చేసుకునే సమయంలో అక్కడ కూడ నేను ఫలాన అని చెబుతారు. పురుషుల దగ్గరకు వెళ్ళి ప్రయత్నించినప్పుడు అతను కూడను తనను తాను పరిచయం చేసుకున్నప్పుడు నేను ఫలాన అని చెబుతారు. దుఃఖముగా వున్న వారి దగ్గరకు పోయి ఎందుకయ్యా నీవు దుఃఖ పడుతున్నావు నీవెవరు అని ప్రశ్నిస్తే నేను ఫలాని వాళ్ళ స్వామి ఫలాని కర్మచేత ఫలాని కష్టము చేత దుఃఖిస్తున్నానని తనను తాను పరిచయం చేసుకున్నప్పుడు దుఃఖితుడు కూడా నేను అనే పదమును వుపయోగపెడుతున్నాడు. కనుక మానవుడు ఎవరినిగాని పరిచయము చేసుకునే సమయంలో ప్రతి వ్యక్తి తనను తాను నేను అనే పదము చేతనే పరిచయము చేసుకుంటున్నాడు. కనుక నేను అనేది ఏమిటి? అదే సర్వుల యందూ ఏకంగా వుండిన ఆత్మ తత్వము. ఒకరి దగ్గర ప్రేమ లేక పోవచ్చు. ఒకరికి శాంతి వుండవచ్చు లేక పోవచ్చు. ఒకరికి సత్యం వుండవచ్చు లేక పోవచ్చు కాని సర్వుల యందు నేను అనేది ఎప్పటికి అందరియందు వుంటుండది. అదే ఈశావాస్యమిదం సర్వమ్' అందరియందు వున్నది ఒక్కటే. అదే నేను. ఆ నేను అనే తత్వమే ఆత్మ భావము.

కనుక దీనిని ప్రత్యేకంగా మీరు విచారించనక్కరలేదు. నేతి నేతి అని వేదాంతము నందు వుపదేశము సల్పుటములో వుండిన అంతరార్థము ఇదే. నేను అనేది సర్వులయందు వుంటున్నది. నాయందు వున్న నేనే నీయందువున్నది. నీయందు వున్న నేనే ఆమెయందు వున్నది. నాయందు వున్న నేనే ఇతనియందు వున్నది. ఈ ఏకాత్మ భావాన్ని చక్కగా గుర్తించుకుంటే యీ విధమైన అలజడులకు అవకాశము వుండదు. ఎవరిని బాధించినా తనను తాను బాధించుకున్నవాడే అవుతాడు. ఎవరిని తాను దూషించినా తనను తాను దూషించుకున్నవాడౌతాడు. ఇదే శంకరాచార్యులవారు కాశీక్షేత్రము ప్రవేశించినప్పుడు ఒక ఛండాలుడు వచ్చి సమీపిస్తుండగా శంకరాచార్యుల వారు హే దూరము దూరము అన్నారు. అతను చెప్పాడు ఎవరిని దూరముగా వుండమన్నావు? దేహమునా? దేహము జడము ఈ జడమైన దేహము జడమైన దేహమును దూరము వుండమని చెప్పటానికి ఏమి అధికారము లేదే. రెండూ జడమైనవే. జడము జడాన్ని పలుకరించటానికి యేమీ ప్రేమ అవకాశము లేదు. పోనీ ఆత్మ తత్వాన్ని నీవు దూరము వుండమంటున్నావా? నీలో వున్నదీ ఆత్మనే నాలో వున్నది ఆత్మనే. నన్నే దూరము వుండమని చెప్తూ తున్నావు. అని యీ విధంగా శరీర ఆత్మలను పురస్కరించుకొని వాదోపవాదములు జరుగుతూవచ్చాయి. అప్పుడు శంకరాచార్యులవారు చక్కగా గుర్తించి యీ నిజమైన ఆత్మతత్వము గుర్తించిన వాడు కేవలము ఏకాత్మ భావము ఈశ్వరుడే తప్ప మరొకరు కాదని సాష్టాంగ నమస్కారము చేశాడు. అప్పుడే ఛండాలుడు శంకర స్వరూపము దర్శింపజేసి నీలో వుండిన దుర్భావములు దూరము గావించుకునే నిమిత్తమై యీ రూపాన్ని ధరించి నేను యీ విధంగా ప్రవేశించానని సాక్షాత్ శంకరుడే శంకరాచార్యులను ప్రబోధించాడు. కనుక భగవంతుడు మానవులలో వుండిన దుశ్చర్యలను, దుర్భావములను, దుర్గుణములను దూరము గావించే నిమిత్తమై ఏ రూపములో ఏ స్థానములో ఏ కాలములో యెక్కడ వస ప్రత్యక్షమౌతాడో చెప్పటానికి వీలు లేదు. కనుక మొట్టమొదట మనలో దుర్గుణాల్ని ప్రవేశపెట్టకుండా సాధ్యమైనంత వరకు సద్గుణముల చేత, సదాచారముల చేత మన జీవితమును

ఇదే నిజమైన సాధన. కేవలము జపమా జపము అని కూర్చొని జపము చేస్తూ కూడను దుర్గుణములు అభివృద్ధి పరచుకుంటే ఎవరి నిమిత్తమై చేసే జపము. ఇది కేవలము artificial జపము. నిజమైనది heart లో చెయ్యాలి. ధ్యానమునకు కూర్చుంటారు. ధ్యానములో కదలక మెదలక ఒక

statue మాదిరి కూర్చొని వుంటారు. కాని అతను తన్మయత్వములో ధ్యానము చేస్తున్నాడని భావిస్తాము. కొంత సేపటికి ఒక దోమ వచ్చిందంటే టక్కున దాన్ని కొట్టేస్తాడు. ఏమి ధ్యానము చేస్తున్నాడు. భగవంతుని చేస్తున్నాడా? mosquito ని చేస్తున్నాడా? నిజంగా భగవంతునే చేస్తుంటే ఈ mosquito యేమి తెలియదే. కనుక ఈనాడు జపములు, ధ్యానములు, యోగములు, యజ్ఞములు ఇవన్నీ artificial గా జరుగుతున్నాయి గాని heart లో జరిగేవి కాదు. కనుక ఫలితములు కూడను artificial గానే కనుపిస్తున్నాయి. యద్భావం తద్భవతి. మామిడి పండు తింటే దోస పండు త్రేపు వస్తుందా? ఏ విధమైన చర్యలో ఆ విధమైన ఫలితము అందుతుంటాది. ఇది భగవంతుడు అందించే వరప్రసాదము కాదు. యిది నీవు నీకు అందుకున్నటువంటి, నీవు నీవు సంకల్పించుకున్న ఫలితములే. కనుక భగవంతుని యేమాత్రము నిందించకూడదు. నీ కష్టములకు, నీ సుఖములకు నీ చర్యలే కారణము. ఈ సత్యాన్ని గుర్తించుకొని మన చర్యలను సరైన మార్గములో ప్రవేశ పెట్టుకోటం అత్యవసరము

విద్యార్థులారా! ఈ పన్నెండు దినములు కూడను ఎంతో ఆనందంగా ఆత్మ తత్వాన్ని ఆనంద స్వరూపాన్ని లౌకికమును, భౌతికమును, ఆధ్యాత్మికమును అన్నింటి యందు సరైన తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇలాంటి దినములే ప్రధానమైన దినములు. అనేక పద్యములు చెప్తూ వుంటాము.

సద్భక్తులందరు భగవంతుడా యంచు
చెవుల కింపుగ స్మరణ చేయు దినము
బాధలవెతలన్ని ప్రీతి తోడ నెరవేర్చి
అన్నదమ్ముల వలె నున్న దినము
దైవ చింతన చేయు దాస బృందములకు
ప్రీతి మృష్టాన్నము పెట్టు దినము
మహనీయు లెవరైన మనకడకేతెంచి
చెలిమి భగవత్కథలు చెప్పు దినము.

దినముగాని తక్కినవన్ని దుర్దినాలు. నిజమైన దినములు ఈనాటివి. అనగా పరప్రాణములను ఆనంద పెట్టి, వారిని అనుకూల పరచి, తగిన సుఖములను అందించిన దినమే నిజమైన దినము. ఇలాంటి దినములు దినములుగా గడిపి దివ్యజీవితం సత్యమైన జీవితంగా తీర్చిదిద్దుకుంటారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ రేపటి దినము 9 గంటలకు మనము ప్రారంభించిన వ్రతము, తపము, క్రతువు రేపటితో

పూర్తి అవుతుందని నేను చెప్పను. పూర్తి అనేది ఎప్పుడూ లేదు. ఇది అనంతమైన వ్రతము. కానీ మనము నిర్ణయించిన కాలమును రేపటి దినము అంత్యదినము అసలు తపస్సంటే ఏమిటి? కర్తవ్య కర్మలను నిర్వర్తించటమే తపస్సు. ఈనాడు కర్తవ్య కర్మలు విస్మరించటం చేతనే తమస్సుగా మారిపోతున్నది. కనుక ఈ తపస్సునే కర్తవ్యమును మీ జీవితమంతా నిర్వర్తించుకుంటూ రావాలి. నీ కర్తవ్యమే ప్రధానమైన సాధనము. నీ కర్తవ్యమే ప్రధానమైన తపస్సు. నీ కర్తవ్యమే నీ ప్రధానమైన గమ్యము. కనుక విద్యార్థులు జీవితమంతయు పరోపకార సంబంధమైన కర్తవ్యమును దృష్టియందుంచుకొని తన స్వార్థమును పరార్థమును ఏకత్వంగా భావించి ఆదర్శవంతమైన జీవితాన్ని అందిస్తారని నేను ఆశిస్తున్నాను.